LAUNCHING TODAY
KARAPATRAM
Daily Digital News Paper

# కరపత్రం

SINCE 2014

శనివారం అక్టోబర్ 12 2024 సంపుటి :0 సంచిక : 4 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు: 4

## హైడ్రాతో కలిసి మూసీ ఆక్రమణల కూల్చివేతలు

# పర్యావరణ పరిరక్షణకా.. స్వప్రయోజనాల సాధనకా!

– శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్

»తెలంగాణ లో శ్రీ రేవంత్ రెడ్డి గారు ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినాక ఇప్పుడు హైడ్రా ఏర్పాటుతో,హైడ్రా దూకుడుతో ప్రజల్లో వేడి వేడి చర్చలు మొదలయ్యాయి.

»హైద్రాబాద్ లో వందలాది చెరువులు కుంటలు కాలువలు సహజ రూపాన్ని కోల్పోయాయని తెలంగాణ వాటర్ రిసోర్సెస్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీ వీరమల్ల ప్రకాష్ గారు ఒక సుదీర్ఘ ఇంటర్వ్యూలో అన్నారు.

»1981 నుండి నీటి వనరులు మెల్ల మెల్లగా ఆక్రమణలకు గురయ్యి నిర్జీవమయ్యాయి.

»2014 సం.కు ముందు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం, 2014 తర్వాత బి ఆర్ ఎస్ ప్రభుత్వ కాలంలో నీటి వనరుల విధ్వంసం యధేచ్చగా సాగిపోయింది.

»ఇప్పుడు మళ్ళీ అధికారం లోనికి వచ్చిన కాంగ్రెస్ చేపట్టిన నీటి వనరుల రక్షణ సాధ్యాసాధ్యాల గురించి మేధావుల నుండి సామాన్యుల వరకు చర్చలు నడుస్తున్నాయి.

»హైడ్రా ఏర్పాటును హడావుడిగా ప్రకటించిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం సినీ నటుడు నాగార్జున కు చెందిన ఎన్ కన్వెన్షన్ ను కూల్చి ఒక కొత్త చర్చను లేవదీసింది.


శ్రీ వీరమల్ల ప్రకాశ్
తెలంగాణ నీటి వనరుల అభివృద్ధి కార్పొరేషన్ మాజీ చైర్మన్.

**చెరువుల్లో** వెలసిన కొన్ని అపార్ట్ మెంట్లను,షెడ్లను ఇతర ఆక్రమణలను తొలగించి ప్రజల దృష్టిని ఆకట్టుకున్నది. హెచ్ ఎం డి ఎ అనుమతులతో, స్థానిక పాలక మండలుల అనుమతులతో నిర్మించిన భవనాల్లో ఇండ్లు ప్లాట్లు విల్లాలు కొనుక్కున్న వారికి బ్యాంకులు లోన్లు కూడా ఇచ్చాయి.అన్నీ సవ్యంగా ఉన్నాయని సామాన్యులు కొనుక్కుంటే అకస్మాత్తుగా హైడ్రా రంగప్రవేశం చేసి కూల్చుతుండడంతో భాదితులు కన్నీరు మున్నీరయ్యారు. కోర్టులను ఆశ్రయించారు.నీటి వనరుల రక్షణ ఉద్దేశ్యం మంచిదే కానీ అమలుతీరు ఆక్షేపనీయమని కోర్టులు రేవంత్ రెడ్డి ప్రభుత్వ పనితీరుని ప్రశ్నించాయి.వెంటనే హైడ్రా ను మూసీ వైపు మళ్లించి పేదల ఇండ్లు కూల్చడం మొదలెట్టింది రాష్ట్ర ప్రభుత్వం.అనంత గిరి కొండల్లో ఉద్భవించిన మూసీ నది ప్రవాహం మొత్తం 254 కి.మీ.లు. ఈ మూసీ నది ఔటర్ రింగ్ రోడ్డు లోపల మొత్తం 53 కి.మీ మేర ప్రవాహ పరిధి కలిగి ఉన్నది.ఇందులో కేవలం 13 కి.మీ.లు మాత్రమే జి హెచ్ ఎం సి పరిధిలో ఉంటుంది.మిగతా 42 కి.మీ.లు జి హెచ్ ఎం సి పరిధి బయట ఉంటుంది.ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న మొత్తం ప్రాంత పరిధిని,మూసీ ప్రవాహ పరిధిని, హైడ్రా పరిధిగా నిర్ణయిస్తూ తేదీ: 19 జులై 2024 రోజున తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జి.వో. 99 ద్వారా ప్రకటించింది.హైడ్రా కు అసెంబ్లీ ఆమోదం ద్వారా చట్ట బద్ధత కల్పించే పనిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నది.చాలా చెరువులకు,కుంటలకు ఎఫ్.టి.ఎల్ పాయింట్లు లేవు,బఫర్ జోన్ లు కూడా నిర్ధారించలేదు.గూగుల్ మ్యాప్ ల తో ఈ ఎఫ్.టి.ఎల్ బఫర్ జోన్ లను నిర్ధారించడం సాధ్యం కాదు.అప్పుడు రెవెన్యూ శాఖ, ఇరిగేషన్ శాఖల డాటా మాత్రమే ఆధారవుతుంది. ఎఫ్. టి .ఎల్ పాయింట్లు లేకుండా చేసే కూల్చివేతలు ప్రభుత్వం జవాబు దారీ అవుతుంది.చెరువులకు కుంటలకు కొత్తగా ఎఫ్. టి.ఎల్. బఫర్ జోన్ల నిర్ధారణ చెయ్యడం భగీరథ ప్రయత్నమే అవుతుంది. తెలంగాణ నదులకు కాలువలకు ఇప్పటికీ అసలు ఈ ఎఫ్.టి.ఎల్. బఫర్ జోన్ల పరిధి లేదు.మన తెలంగాణ లోనే కాదు మొత్తం భారత దేశం లో ఏ నదికీ ఎఫ్.టి.ఎల్. బఫర్ జోన్ల నిర్ధారణ లేదు.మూసీ నది లో దశాబ్దాలుగా నివాసముంటున్న పేదల ఇండ్లు తొలగించే ముందు వారికి పునరావాస ఏర్పాట్లు చెయ్యకుండా హడావుడిగా కూల్చివేతలు మొదలు పెట్టిన రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వైపులా నుండి విమర్శలు ఎదుర్కొంటున్నది.చివరికి రాష్ట్ర హైకోర్టు కూడా ఈ చర్యలను తప్పుబట్టింది.హైడ్రా కమీషనర్ శ్రీ రంగనాథ్ గారిని స్వయంగా కోర్టు విచారణకు పిలిచి హై కోర్టు మందలించింది.పేద ప్రజల సహజ న్యాయ హక్కులను భంగపరిచే విధానం ఆపెయ్యాలని ఉన్నత న్యాయస్థానం హైడ్రాను మందలించింది. న్యాయమూర్తి మంద లింపుతో మూసీ కూల్చివేతలకు హైడ్రా కు సంబంధం లేదని శ్రీ రంగనాథ్ గారు కోర్టుకు చెప్పడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది.దీనితో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆత్మ రక్షణలో పడింది.హైడ్రా వల్ల కాంగ్రెస్ కు లాభమా నష్టమా అని కాంగ్రెస్ నాయకుల్లో,కార్యకర్తల్లో ఒక అయోమయం మొదలయ్యింది.దీన్ని గమనించిన కాంగ్రెస్ అధినాయకత్వం ఈ విషయం గురించి రాష్ట్ర పార్టీ పరిశీలకులతో,పార్టీ నాయకులతో సమాలోచనలు చేస్తున్నది.

3 లో

## మాది చేతల ప్రభుత్వం

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



ఖమ్మం: విద్య, వైద్యానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గత పదేళ్లలో రాష్ట్ర ప్రజలకు భారాస చేసిందేమీ లేదని విమర్శించారు. ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్‌లో సమీకృత గురుకుల పాఠశాల భవనానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "పేదల పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది. నేడు రాష్ట్రవ్యాప్తంగా 28 సమీకృత గురుకుల పాఠశాలలకు శంకుస్థాపన చేస్తున్నాం.

2 లో

## సొంతూళ్లకు నగర ప్రజల ప్రయాణం

- రద్దీగా మారిన రహదారులు
- ఖాళీ అవుతున్న రాజధాని నగరం
- దొంగల కదలికలపై పోలీసుల దృష్టి




హైదరాబాద్,అక్టోబర్11 : రాష్ట్రంలో అతిపెద్ద పండుగ అయిన దసరాకు ప్రజలు సొంతూళ్లకు వెళ్తున్నారు. పండుగకు బంధువులు, స్నేహితులను కలుసుకోవడానికి అవకాశం ఉండటంతో కుటుంబంతో కలిసి ఇంటిబాట పట్టారు.

2 లో

## సైబర్ నేరగాళ్లకు ఏఐతో కళ్లెం!

### రంగంలోకి బ్యాంకులు, సెల్‌ఫోన్ సంస్థలు




హైదరాబాద్: సామాన్యుల నుంచి సంపన్నుల దాకా.. పల్లెల నుంచి నగరాల దాకా.. ప్రజలకు మాయమాటలు చెప్పి.. భయపెట్టి, బెదిరించి.. వివిధ మార్గాల్లో నిలువునా లూటీచేస్తున్న సైబర్ నేరగాళ్లను అదుపుచేసే ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. నేరం జరిగిన తర్వాత దర్యాప్తు జరపడం కంటే నేరం జరగకుండా జాగ్రత్తపడటం ముఖ్యం. ఇంతవరకు పోలీసులు మాత్రమే ఇలాంటి బాధ్యత తీసుకోగా ఇప్పుడు సెల్‌ఫోన్ ప్రొవైడర్లు, బ్యాంకులు రంగంలోకి దిగాయి. సైబర్ నేరగాళ్లకు చెక్ పెట్టేందుకు కృత్రిమమేధ (ఏఐ) సాయంతో ప్రత్యేక ప్రోగ్రామ్స్ సిద్ధం చేస్తున్నాయి. కేవలం 10 రోజుల వ్యవధిలో రెండు తెలుగు రాష్ట్రాల్లో 12 కోట్ల అనుమానాస్పద కాల్స్ గుర్తించామని ఎయిర్‌టెల్ సంస్థ అధికారికంగా ప్రకటించింది. దీన్నిబట్టి సైబర్ నేరగాళ్లు ఏ స్థాయిలో విరుచుకుపడుతున్నారో అర్థమవుతోంది. ఈ ఏడాది మొదటి 9 నెలల్లో ఒక్క తెలంగాణలోనే సైబర్ నేరగాళ్లు దాదాపు రూ.1,500 కోట్లు దోచుకున్నారు. ఈ ఏడాదిలో సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు రూ.110 కోట్లు రికవరీ చేయగలిగారు. దోచుకున్న సొత్తులో ఇది పదోవంతు కూడా లేదు. తమకున్న పరిమితుల దృష్ట్యా పోలీసులు ఇలాంటి నేరాలను అంతగా అదుపు చేయలేకపోతున్నారు. నేరగాళ్లు ఎక్కడుంటారో తెలీదు.. ఎలాఉంటారో తెలీదు.. తప్పుడు పత్రాలతో ఫోన్లు, బ్యాంకు ఖాతాలు తీసుకొని బురిడీ కొట్టిస్తున్నారు. వీళ్ల ఆచూకీ తెలుసుకునేసరికి దోచుకున్న డబ్బు వివిధ రూపాల్లో దేశం దాటుతోంది. ఒకవేళ నిందితులు పట్టుబడినా రికవరీ మాత్రం కష్టసాధ్యంగా మారింది. ఒక తరహా నేరంపై ప్రజల్లో అవగాహన పెరిగేసరికి నేరగాళ్లు మరో కొత్తతరహా మోసాన్ని తెరపైకి తెస్తున్నారు. ఈ నేపథ్యంలో నేరాలు జరగకుండా చూసేందుకు బ్యాంకులు, సెల్‌ఫోన్ ప్రొవైడర్లు రంగంలోకి దిగాయి.

2 లో

## కొండా సురేఖకు కోర్టు నోటీసులు

**మంత్రి కొండా సురేఖపై సినీ నటుడు అక్కినేని నాగార్జున వేసిన క్రిమినల్ పరువునష్టం పిటిషన్‌పై నాంపల్లి ప్రత్యేక కోర్టు గురువారం విచారణ జరిపింది.**

- నాగార్జున పిటిషన్‌పై న్యాయస్థానం చర్యలు
- మంత్రిపై చర్యలు తీసుకోవాలంటూ తాజాగా న్యాయస్థానాన్ని ఆశ్రయించిన కేటీఆర్





మంత్రి కొండా సురేఖపై సినీ నటుడు అక్కినేని నాగార్జున వేసిన క్రిమినల్ పరువునష్టం పిటిషన్‌పై నాంపల్లి ప్రత్యేక కోర్టు గురువారం విచారణ జరిపింది. ఈ కేసులో వివరణ ఇవ్వాలని ఆమెకు న్యాయస్థానం నోటీసులు పంపింది. విచారణను ఈ నెల 23వ తేదీకి వాయిదా వేసింది. మరోపక్క సురేఖపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి కేటీఆర్ గురువారం నాంపల్లి ప్రత్యేక న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఇప్పటికే ఆమెకు లీగల్ నోటీసు పంపించి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసిన ఆయన... నిరాధార ఆరోపణలు చేసిన ఆమెపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని తాజాగా పిటిషన్ వేశారు. "2014 నుంచి 2023 వరకు సీఎం కేసీఆర్ క్యాబినెట్‌లో మంత్రిగా పనిచేశా. సిరిసిల్ల నియోజకవర్గం నుంచి ఐదోసారి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నా. భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడిగా, సమాజంలో గౌరవప్రదమైన స్థానంలో ఉన్నా. మంత్రిగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేశా. ప్రపంచంలోని బహుళజాతి సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేలా కృషి చేశా.

మిగతాది 2లో

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శనివారం అక్టోబర్ 12 2024

# సైబర్ నేరగాళ్లకు ఏఐతో కళ్లెం!

మొదటిపేజీ తరువాయి

### ఏఐ అండతో..

సైబర్ నేరగాళ్లు ఫోన్ ద్వారా బాధితులను సంప్రదిస్తారు. మాయమాటలతో ముగ్గులోకి దింపుతారు. నేరం జరిగిన తర్వాత బాధితులు తమకు ఫలానా నంబర్ నుంచి ఫోన్ వచ్చిందని చెప్పినప్పుడు పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. చివరకు ఆ నంబర్ తప్పుడు చిరునామాతో తీసుకున్నట్లు గుర్తించి దాన్ని రద్దు చేయిస్తున్నారు. ఇది జరిగేలోపు ఆ నంబర్ నుంచి అనేక మందిని మోసం చేస్తుంటారు. అందుకే అసలు ఇలాంటి కాల్స్ లేదా మోసపూరిత సందేశాలను గుర్తించి నివారించడానికి.. లేదంటే ప్రజలను అప్రమత్తం చేయడానికి సెల్‌ఫోన్ ప్రొవైడర్లు నడుం బిగించారు. ఏఐతో సాఫ్ట్‌వేర్ రూపొందిస్తున్నారు. దాదాపు 200 అంశాలను ప్రామాణికంగా తీసుకొని అనుమానాస్పద కాల్స్, సందేశాలను గుర్తిస్తున్నామని ఎయిర్‌టెల్ సంస్థ ప్రకటించింది. ఒకే నంబర్ నుంచి దేశంలోని వేర్వేరు ప్రాంతాలకు వరుసపెట్టి కాల్స్ వెళుతుంటే అది అనుమానాస్పద నంబర్ కిందే లెక్క. కొత్తగా నంబర్ తీసుకున్న వెంటనే వరుసపెట్టి కాల్స్ చేస్తున్నా.. అప్పటివరకూ పెద్దగా ఫోన్‌కాల్స్ వెళ్లని నంబర్ నుంచి అకస్మాత్తుగా కాల్స్, సందేశాలు వెళుతున్నా అనుమానాస్పదంగానే భావించేలా సాఫ్ట్‌వేర్ రూపొందించారు. ఇలాంటి ప్రామాణికాంశాల ఆధారంగా కేవలం పది రోజుల వ్యవధిలో 12.2 కోట్ల స్పామ్ కాల్స్, 23 లక్షల సందేశాలు గుర్తించినట్లు ఎయిర్‌టెల్ సంస్థ ప్రకటించింది. వీటిని నిరోధించడమో.. లేదంటే మీకు వచ్చింది అనుమానాస్పద కాల్, సందేశం అని వినియోగదారులను హెచ్చరించడమో చేస్తున్నారు.

### బ్యాంకులు కూడా..

సైబర్ నేరగాళ్లు దోచుకున్న డబ్బులను బ్యాంకు ఖాతాల్లోకి మళ్లిస్తుంటారు. ముందు ఒకటి రెండు ఖాతాల్లోకి, ఆ తర్వాత వాటినుంచి ఒకేసారి వందల ఖాతాల్లోకి మళ్లిస్తుంటారు. ఈ ఖాతాలను కట్టడి చేయగలిగితే దోపిడీని అడ్డుకోవచ్చు. కాని సైబర్ నేరగాళ్లు తప్పుడు వివరాలతో ఖాతాలు తెరిపించడంతోపాటు అమాయకులకు కమీషన్ ఆశ చూపించి వారి ఖాతాలను వాడుకుంటున్నారు. అందుకే ఇలాంటి ఖాతాలను గుర్తించేందుకు బ్యాంకులు కూడా ఏఐ ద్వారా ప్రత్యేకంగా సాఫ్ట్‌వేర్ రూపొందిస్తున్నాయి. ఖాతా తెరిచిన వెంటనే పెద్దమొత్తంలో డబ్బు జమఅయినా, ఆ వెంటనే ఆ ఖాతా వాడకపోయినా, చాలాకాలంగా ఉన్న ఖాతాలో అకస్మాత్తుగా భారీస్థాయిలో లావాదేవీలు మొదలైనా సాఫ్ట్‌వేర్ గుర్తిస్తుంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఇలా దాదాపు 3 లక్షల ఖాతాలు గుర్తించి వాటిని రద్దుచేసింది. ఒకవేళ నిజమైన వినియోగదారుడు ఎవరైనా తన ఖాతా రద్దుచేసినట్లు ఫిర్యాదుచేస్తే వ్యక్తిగతంగా పరిశీలించి మళ్లీ పునరుద్ధరిస్తున్నారు. మిగతా బ్యాంకులు, సెల్‌ఫోన్ సంస్థలు కూడా ఇప్పుడు ఇదే బాట పట్టాయి. దీంతో రాబోయే రోజుల్లో సైబర్ నేరగాళ్ల ఆగడాలకు కళ్లెం పడే అవకాశం ఉంది.

## సొంతూళ్లకు నగర ప్రజల ప్రయాణం

మొదటిపేజీ తరువాయి

ఆర్టీసీ బస్సులు, సొంత, ప్రైవేటు వాహనాల్లో పట్నం వాసులు పల్లెబాట పట్టడంతో హైదరాబాద్ ఖాళీ అవుతున్నది. దసరా పండగ వేళ.. భాగ్యనగరం నిర్మానుష్యంగా మారింది. పండగ కోసం నగర ప్రజలు స్వస్థలాలకు వెళ్లారు. దీంతో నగరంలోని రహదారులన్నీ బోసిపోయాయి. అలాగే నగరంలోని ఆర్టీసీ బస్సులు సైతం ప్రయాణికులు లేకుండా ఖాళీగా తిరుగుతున్నాయి. దసరా పండగ నేపథ్యంలో వరుసగా సెలవులు రావడంతోపాటు నగర జీవులు..

## కొండా సురేఖకు కోర్టు నోటీసులు

మొదటిపేజీ తరువాయి

పలు అవార్డులను పొందా. అలాంటి నన్ను ఉద్దేశపూర్వకంగా కించపరిచేందుకు కొండా సురేఖ ప్రయత్నించారు. ఆమె మాట్లాడిన మాటలు పత్రిక, మీడియా, సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. నన్ను కించపరిచేలా ఆమె చేసిన వ్యాఖ్యల గురించి నేతలు సత్యవతి రాథోడ్, దాసోజు శ్రవణ్, బాల్క సుమన్, తుల ఉమ నాతో చెప్పారు. 2024 ఏప్రిల్‌లో ఎన్నికల ప్రచార సమయంలోనూ ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు. అప్పుడు నా ఫిర్యాదుతో ఎన్నికల కమిషన్ సురేఖను హెచ్చరించింది. మరోసారి అక్టోబర్ 2న బహిరంగంగా ఆమె చేసిన వ్యాఖ్యలు నన్ను బాధించాయి. సమాజంలో నా గౌరవాన్ని తగ్గించాయి. భారతీయ న్యాయ సంహిత 356 కింద సురేఖపై చర్యలు తీసుకోవాలి" అని న్యాయస్థానాన్ని కోరారు. పిటిషన్‌ను స్వీకరించిన న్యాయస్థానం సోమవారం విచారించే అవకాశం ఉంది. ఉద్యోగ పరీక్షల్లో ఏ ప్రశ్న వచ్చినా తెలుగు అకాడమీ ముద్రిస్తున్న పుస్తకాలే ప్రామాణికం...ఇప్పటివరకు అభ్యర్థులు సహా అందరూ విశ్వసిస్తోంది ఇదే. తాజాగా టీజీపీఎస్సీ హైకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో ఆ పుస్తకాలు ప్రామాణికం కాదని, నిపుణుల కమిటీదే తుది నిర్ణయమని పేర్కొనడంతో అభ్యర్థులు, నిరుద్యోగులు సందిగ్ధంలో పడ్డారు. మున్ముందు ఉద్యోగ పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలంటే ఏ పుస్తకాలు, మెటీరియల్ చదవాలన్నది సమాధానం దొరకని ప్రశ్నలుగా తయారయ్యాయి. గ్రూపు-1 తుది కీపై కొందరు ఇటీవల హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయడం.. తెలుగు అకాడమీ పుస్తకాల్లోని జవాబులను గుర్తించినా వాటిని పరిగణనలోకి తీసుకోలేదని పిటిషన్ తరఫు న్యాయవాది వాదించడం... ఆ పుస్తకాల్లో రిఫరెన్స్‌లు లేవని, రీసెర్చ్ వర్క్ చేయలేదని, నిపుణుల కమిటీ నిర్ణయం తర్వాతే తుది ఫలితాలు విడుదల చేశామని టీజీపీఎస్సీ పేర్కొన్న నేపథ్యంలో ఈ గందరగోళం నెలకొంది. దీనిపై హైకోర్టులో ఈనెల 18న తదుపరి విచారణ జరగనుంది.

### మార్కెట్లోకి ఎన్ని వచ్చినా...

ఇప్పటివరకు ఉద్యోగ పోటీ పరీక్షలకు సంబంధించి అభ్యర్థులు తెలుగు అకాడమీ పుస్తకాలను ప్రామాణికంగా భావిస్తూ ఉంటారు. వాటికోసం ఎదురుచూస్తుంటారు. మార్కెట్లోకి ఎన్నో పుస్తకాలు వస్తున్నా...అకాడమీ పుస్తకం చదవకుండా...కొనకుండా పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే వారు చాలా తక్కువ. గ్రూప్ ఉద్యోగాల నోటిఫికేషన్లు వెలువడినప్పుడు పెద్ద ఎత్తున ఈ పుస్తకాలకు డిమాండ్ ఉంటుంది. అకాడమీ... సకాలంలో డిమాండ్ మేరకు సమకూర్చలేక చేతులెత్తేసిన సందర్భాలు ఎన్నో. ఈ పరిస్థితుల్లో టీజీపీఎస్సీ తాజాగా హైకోర్టులో వినిపించిన వాదనలు అభ్యర్థులను అయోమయంలోకి నెట్టాయి.

### తీర్పు వెలువడిన తర్వాత కమిషన్ అధికారులతో చర్చిస్తాం

అకాడమీ డిగ్రీ పాఠ్య పుస్తకాలతోపాటు ఉద్యోగ పోటీ పరీక్షలకు అవసరమైన చరిత్ర, జాగ్రఫీ, వర్తమాన వ్యవహారాలు, ఆర్థికశాస్త్రం తదితర పుస్తకాలను ముద్రిస్తోంది. రచయితలను ఎంపిక చేసి పుస్తకాలను రాయిస్తుంది. ప్రతి పుస్తకానికి ఎడిటర్ కూడా ఉంటారు. వాటిని అకాడమీలో సబ్జెక్టుల వారీగా ఉండే ఇన్‌ఛార్జులు సైతం పరిశీలిస్తారు. ఆ తర్వాత మార్కెట్లోకి విడుదల చేస్తారు. అయినా ఆ పుస్తకాలపై టీజీపీఎస్సీ అభ్యంతరాలను లేవనెత్తడంతో అకాడమీ వర్గాలు సైతం అయోమయంలో పడ్డాయి. తరచూ తాజా అంశాలను జోడిస్తూ...పునఃముద్రణ చేయడం, పుస్తకాల్లో ఏమైన తప్పులుంటే ఈ-మెయిల్, వాట్సప్ ద్వారా అభ్యంతరాలను స్వీకరించడం నిరంతరం జరగాల్సి ఉందని నిపుణులు సూచిస్తున్నారు. తెలుగు అకాడమీ వర్గాలు మాట్లాడుతూ హైకోర్టు తీర్పు వెలువడిన తర్వాత టీజీపీఎస్సీ లేవనెత్తిన అంశాలపై కమిషన్ అధికారులతో సమావేశమై చర్చిస్తామని తెలిపాయి. ఆ ప్రకారం అవసరమైతే పుస్తకాల్లో మార్పులు చేర్పులు చేస్తామని వివరించాయి.

## తిరుమలలో ముగింపు దశకు బ్రహ్మోత్సవాలు

### విద్యుద్దీపకాంతుల్లో తిరుమల గిరులు

తిరుమలలో ముగింపు దశకు బ్రహ్మోత్సవాలు చేరుకున్నాయి. శుక్రవారం చక్రతాళ్వార్‌కు స్నానం చేయిస్తారు. కోనేటిలో భక్తుల స్నానాలకు ఏర్పాట్లు చేశారు. మరోవైపు శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా టీటీడీ విద్యుత్ శాఖ తిరుమలలో ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకరణలతో తిరుమల కొండ వైకుంఠాన్ని తలపిస్తోంది. వైకుంఠం భువికి దిగివచ్చిందా అన్న చందంగా విద్యుత్ కాంతులతో తిరుమల కొండ భక్తులను కనువిందు చేస్తోంది. శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా వాహన సేవలను వీక్షించేందుకు వచ్చిన లక్షలాదిమంది భక్తులను ఆకట్టుకునేందుకు శ్రీవారి ఆలయాన్ని ప్రత్యేకమైన పార్కన్ , ఫకాడ్ లైటింగ్ తో టీటీడీ అలంకరించింది. రంగురంగుల కాంతులతో శ్రీవారి ఆలయ గోడలను, మహాద్వార గోపురం, మాడ వీధులు, ముఖ్యమైన కూడళ్లు, ఆర్చిల వద్ద భక్తులు మైమరచేలా విద్యుత్ వెలుగులను శోభాయమానంగా అలంకరించారు. తిరుమలలోని ఇతర ఆలయాలు, గా÷-డర్గ÷న్లు, చెట్లను కూడా ప్రత్యేక విద్యుత్ కాంతులతో సినిమా సెట్టింగ్ లను అలంకరణలు చేశారు. పురాణాలు, ఇతిహాసాల్లోని దేవతల రూపాలతో తిరుమల కొండ మొత్తం విద్యుత్ బోర్డులు ఏర్పాటు చేయడంతో భక్తులకు వైకుంఠంలో ఉన్న అనుభూతి కలుగుతోంది. శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమలను కలియుగ వైకుంఠంగా అనుభూతి కలిగించేలా విద్యుత్ అలంకరణలకు టీటీడీ రూ.2.20కోట్లు మంజూరు చేసింది. శ్రీవారి ఆలయ ప్రాంగణం, కళ్యాణ వేదిక, కూడళ్ల వద్ద టీటీడీ 14 భారీ ఎలక్ట్రికల్ బోర్డులు, 30 చిన్న ఎలక్ట్రికల్ బోర్డులను ఏర్పాటు చేసింది. లక్ష్మీ వేంకటేశ్వర, సీతా రాములు, శ్రీరామ పట్టాభిషేకం, మహా విష్ణు, విశ్వరూపం, దశావతార రూపాలను భారీ ఎలక్ట్రికల్ బోర్డులతో ఏర్పాటు చేశారు. అష్ట లక్ష్ములు, తుంబూరుడు, అన్నమాచార్యుడి వంటి ఇతర రూపాలతో మరో



30 ఎలక్ట్రికల్ బోర్డులను ఏర్పాటు చేశారు. భక్తులకు విస్మయం కలిగేలా విద్యుత్ కాంతుల అలంకరణకు 100 మందికి పైగా టీటీడీ విద్యుత్
శాఖ సిబ్బంది నెలరోజులకు పైగా తీవ్రంగా శ్రమించారు. విద్యుత్ అలంకరణలపై టీటీడీ ఈఓ జె.శ్యామలరావు మాట్లాడుతూ శ్రీవారిని అత్యంత భక్తి శ్రద్ధలతో పూజించే భక్తులను బ్రహ్మోత్సవాల్లో ఆకట్టుకునేలా ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా విద్యుత్ అలంకరణలను ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామని తెలియజేశారు. భక్తులు వాహన సేవలను తిలకించేందుకు తిరుమలలోని శ్రీవారి ఆలయ మాడ వీధులు, మ్యూజియం, వరహాస్వామి రెస్ట్ హౌస్, అన్నదానం కాంప్లెక్స్, రాంభగీచా, ఫిల్టర్ హౌస్, ఇతర ప్రాంతాల్లో 32 భారీ డిజిటల్ స్క్రీన్లను టీటీడీ ఏర్పాటు చేసింది. బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమలకు విచ్చేసిన భక్తులను ఆకట్టుకునేలా జీఎన్సీ ఏరియాతో పాటు పలు పార్కుల్లో దేవతా రూపాలతో ప్రత్యేక ఎలక్ట్రికల్ కటౌట్ లు ఏర్పాటు చేశారు. తిరుమలలోనే కాకుండా తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనం, బస్టాండ్, రైల్వే స్టేషన్ స్వాగత తోరణాల వద్ద ప్రత్యేకమైన విద్యుత్ అలంకరణలను టీటీడీ ఏర్పాటు చేసింది.

## మాది చేతల ప్రభుత్వం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అమ్మ ఆదర్శ పథకం కింద రూ.657 కోట్లు కేటాయించాం. డీఎస్సీ ద్వారా 11 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చాం. గత ప్రభుత్వం స్కూళు పెట్టిందే తప్ప వసతులు కల్పించడంలో విఫలమైంది. అంతర్జాతీయ ప్రమాణాలతో సమీకృత గురుకుల పాఠశాలలకు శ్రీకారం చుట్టాం. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో రూ.125 నుంచి రూ.150 కోట్లతో అద్భుతంగా స్కూళ్ల నిర్మాణం చేపడతాం. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాల్జేసి ప్రజల నెత్తిన భారం మోపింది. ప్రైవేటుకు దీటుగా పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య అందించేందుకు మా ప్రభుత్వం కృషి చేస్తోంది. మాటలతో కాదు.. చేతలతో చేసి చూపించే ప్రభుత్వం మాది" అని పొంగులేటి అన్నారు.

## సెలక్షన్ చేసింది మీరు.. రాంగ్ సెలక్షన్ అంటుంది మీరే ఏది నిజం..?

ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చినట్టు విద్యాశాఖ అధికారులు చేసిన తప్పుకు అభం శుభం తెలియని అమాయకుడు బలి అయ్యాడు. చిన్న మిస్టేక్ తో ఇలా జరిగిందని చాలా సులభంగా చెప్పడం జరిగింది. ఉద్యోగం సాధించాలనే సంకల్పంతో రాత్రింబవళ్లు కష్టపడి చదివి పరీక్ష రాసి.. దాంట్లో ఎలాగైనా సెలెక్ట్ అవుతానని ధీమాతో..జిల్లా ఆఫీస్ నుంచి ఫోన్ రాగానే అతని ఆశలకు హద్దే లేకుండా పోయింది. కానీ తీరా చూస్తే ఆశ కాస్త నిరాశ గానే మిగిలిన సంఘటన అందరిని కలిచి వేస్తుంది. మొన్న జరిగిన డీఎస్సీ 2024 నియామకాల్లో మీకు ఉద్యోగం.. స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్ లో సెలెక్ట్ అయ్యారు. మీకు మెసేజ్ కూడా వచ్చింది కావచ్చు చూసుకోండి అని జిల్లా విద్యాశాఖ ఆఫీస్ నుంచి ఫోన్ చేసి చెప్పడం జరిగింది. వివరాల్లోకి వెళితే.. కామారెడ్డి జిల్లా గాంధారి మండలం పెద్ద పోతంగల్ గ్రామానికి చెందిన కారంగుల సాయి రెడ్డి అక్టోబర్ 8న వెలువడిన ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్ లో సెలెక్ట్ అయ్యారు. మరుసటి రోజు ఉదయం కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి హైదరాబాద్ సీఎం చేతుల మీదుగా అపాయింట్మెంట్ తీసుకోవాల్సి ఉంది. అంతేకాకుండా అదే రోజు రాత్రి 8 గంటలకు TSONLN తో మెసేజ్ కూడా వచ్చింది.

## హైదరాబాద్ నగరంలో దారుణం

### ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో అమ్మవారి విగ్రహం ధ్వంసం
### దర్యాప్తు చేపట్టిన నగర పోలీసులు

హైదరాబాద్ నగరంలోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో దారుణం చోటు చేసుకుంది. దేవి నవరాత్రుల సందర్భంగా ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాన్ని గత అర్థరాత్రి దుండగులు ధ్వంసం చేశారు. ఈ విషయాన్ని శుక్రవారం ఉదయం స్థానికులు గుర్తించి.. నిర్వాహకులకు సమాచారం అందించారు. దీంతో అమ్మవారి భక్తులతోపాటు పలు హిందు సంఘాల నేతలు.. ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌కు చేరుకున్నారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న బేగంబజార్ పోలీసులు నాంపల్లి గ్రౌండ్స్‌కు చేరుకున్నారు. అబిడ్స్ ఏసీపీ చంద్రశేఖర్‌తోపాటు ఇతర పోలీస్ ఉన్నతాధికారులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం పోలీసులు కేసు నమోదు చేశారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లోకి ప్రవేశించిన దుండగులు తొలుత విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఆ తర్వాత ఆ ప్రదేశంలోని సీసీ కెమెరాలను పగలకొట్టారు. అనంతరం అమ్మవారి విగ్రహం చేతిని విరగొట్టారు. అంతేకాకుండా అమ్మవారి విగ్రహం వద్దనున్న పూజా సామాగ్రిని సైతం చెల్లాచెదురుగా పడేశారు. అమ్మవారి విగ్రహం చుట్టూ ఏర్పాటు చేసిన బారికేడ్లను సైతం దుండగులు తొలగించారు.
ప్రతి ఏడాది ఎక్కడో అక్కడ హిందు దేవతల విగ్రహాలు ధ్వంసం చేస్తున్నారని ఈ సందర్భంగా భక్తుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మనం హిందూదేశంలో ఉన్నామా? లేకుంటే ఇస్లామిక్ దేశంలో ఉన్నామా? అని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విగ్రహంపై దాడి చేసిన దుండగులను వెంటనే పట్టుకొని కఠినంగా శిక్షించాలని పలు హిందు సంఘాలు నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఇంకోవైపు దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ప్రతి ఏడాది ఎగ్జిబిషన్ సొసైటీ, సిబ్బంది ఆధ్వర్యంలో అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తారు. అందులోభాగంగా ప్రతి ఏడాదిలాగానే ఈ ఏడాది విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అయితే గురువారం రాత్రి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో దాండియా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం అయ్యే వరకు పోలీసులు అక్కడే విధులు నిర్వహించారని ఉన్నతాధికారులు తెలిపారు. అమ్మవారి విగ్రహం ధ్వంసం ఘటన అర్థరాత్రి లేకుంటే... శుక్రవారం తెల్లవారుజామున జరిగి ఉండవచ్చని పోలీస్ ఉన్నతాధికారులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజ్‌లను పోలీసులు పరిశీలిస్తున్నారు.

## నిరవధిక నిరాహార దీక్షను కొనసాగిస్తున్న కోల్‌కతా వైద్యులు.. ఒకరి పరిస్థితి విషమం



కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ లోని ఆర్‌జీ కర్ ప్రభుత్వ ఆసుపత్రిలో హత్యాచార ఘటన వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ.. జూనియర్ వైద్యులు చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష శుక్రవారంతో ఆరో రోజుకు చేరుకొంది. కాగా ఈ దీక్షలో పాల్గొన్న వైద్యుల్లో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఆసుపత్రికి చెందిన వైద్యాధికారులు పేర్కొన్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. కొందరు జూనియర్ వైద్యులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా అక్టోబర్ 5 సాయంత్రం నుంచి ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నారు. వారిలో ఒకరైన అనికేత్ మహతో ఆరోగ్య పరిస్థితి క్రమంగా క్షీణిస్తూ వచ్చింది. దీంతో గురువారం రాత్రి అతడిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా ప్రస్తుతం ఆ వైద్యుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. అతడి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించడానికి ఐదుగురు సభ్యులతో కూడిన మెడికల్ బోర్డును ఏర్పాటుచేశామన్నారు. ఇక్కడే నిరాహార దీక్షలో పాల్గొన్న మరో ఆరుగురు వైద్యుల ఆరోగ్యం కూడా క్షీణిస్తున్నట్లు జూనియర్ వైద్యులు పేర్కొన్నారు. వారికి వెంటనే వైద్యం అందించడానికి దీక్ష ప్రాంతంలో ఐసీయూ అంబులెన్స్, ఇతర వైద్య పరికరాలను ఏర్పాటుచేశామన్నారు. తమ డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా పరిష్కరించేవరకు నిరాహార దీక్ష కొనసాగుతుందని వారు పునరుద్ఘాటించారు. ఈ దీక్షలో పాల్గొన్న వైద్యుల్లో ఎవరికి ఏం జరిగినా దానికి రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అలాగే నార్త్ బెంగాల్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న మరో ఇద్దరు జూనియర్ వైద్యులు కూడా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లుగా అక్కడి వైద్యులు తెలిపారు.జూనియర్ వైద్యుల ఆరోగ్య పరిస్థితిపై సీనియర్ వైద్యులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. "ఈ యువ వైద్యులే మన భవిష్యత్తు. వీరు న్యాయం కోసం నిరాహార దీక్ష చేస్తున్నా ప్రభుత్వం ఏమీ పట్టనట్లుగా వ్యవహరిస్తోంది. పరిస్థితి చేయి దాటేలోపే అధికారులు వేగంగా చర్యలు తీసుకోవాలి" అని ఓ సీనియర్ డాక్టర్ బెంగాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కోల్‌కతాలోని ఆర్జీకర్ ప్రభుత్వ కళాశాల ఆసుపత్రిలో ఆగస్టు 9న జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని వైద్య విద్యార్థులు పెద్దఎత్తున నిరసనలు కొనసాగించారు. సీఎం మమతా బెనర్జీ తమ డిమాండ్లను నెరవేర్చేందుకు హామీ ఇవ్వడంతో.. 42 రోజుల పాటు కొనసాగిన నిరసనలు విరమించి గత నెల 21న పాక్షికంగా విధుల్లో చేరారు. అయితే ప్రభుత్వం నుంచి సానుకూల చర్యలు లేకపోవడంతో నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్నారు.

# ఏపీకి వెళ్లాల్సిందే

### ఆంధ్రాకు కేటాయించి తెలంగాణలో ఉన్న ఐఏఎస్, ఐపీఎస్‌లకు డీఓపీటీ ఆదేశం
### ఏపీలో ఉన్నవారు తెలంగాణలో చేరాలని స్పష్టీకరణ
### ఈ ఆదేశాలపై కోర్టును ఆశ్రయించనున్న తెలంగాణలోని అధికారులు?

హైదరాబాద్: పునర్విభజన చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించినా.. కేంద్ర అడ్మినిస్ట్రేటివ్ ట్రైబ్యునల్ (సీఏటీ) ఆదేశాలతో తెలంగాణలో కొనసాగుతున్న ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను ఆంధ్రప్రదేశ్‌లో రిపోర్టు చేయాలని కేంద్రం ఆదేశించింది. అలానే తెలంగాణకు కేటాయించి.. ఆంధ్రప్రదేశ్‌లో కొనసాగుతున్న ఐఏఎస్ అధికారులను తెలంగాణలో రిపోర్టు చేయాలని స్పష్టం చేసింది. ఈ మేరకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ విభాగం (డీఓపీటీ) కార్యదర్శి తాజాగా ఆదేశాలు జారీచేశారు. ఈ ఆదేశాల ప్రకారం తెలంగాణ నుంచి ఐదుగురు ఐఏఎస్‌లు, ముగ్గురు ఐపీఎస్‌లు ఏపీకి వెళ్లాల్సి ఉంది. ఆంధ్రప్రదేశ్ నుంచి ముగ్గురు ఐఏఎస్ అధికారులు తెలంగాణకు రావాల్సి ఉంటుంది.

**జాబితాలో వాణీప్రసాద్, వాకాటి కరుణ, ఆమ్రపాలి....**

ఏపీకి కేటాయించినా తెలంగాణలో కొనసాగుతున్న వారిలో ఐఏఎస్ అధికారులు వాణీప్రసాద్, వాకాటి కరుణ, రొనాల్డ్‌రాస్, ఆమ్రపాలి, ప్రశాంతి, ఐపీఎస్ అధికారులు అంజనీకుమార్, అభిలాష్ బిస్త్, అభిషేక్ మహంతి ఉన్నారు. వాణీప్రసాద్ యువజన, క్రీడల శాఖ ముఖ్యకార్యదర్శిగా, వాకాటి కరుణ మహిళా శిశు సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శిగా, రొనాల్డ్ రాస్ ఇంధన శాఖ కార్యదర్శిగా, ట్రాన్స్‌కో సీఎండీగా, ఆమ్రపాలి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా ఉన్నారు. ప్రశాంతి త్వరలో పదవీ విరమణ చేయనున్నారు. డీఓపీటీ ఆదేశంపై వీరు కోర్టును ఆశ్రయించనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు రావాల్సిన వారిలో ఐఏఎస్ అధికారులు సృజన, శివశంకర్, హరికిరణ్ ఉన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఏపీ నుంచి తెలంగాణకు వెళ్లాలని దరఖాస్తు పెట్టుకున్న ఎస్.ఎస్.రావత్, అనంతరాము అభ్యర్థనలను డీవోపీటీ తిరస్కరించింది. వీరిద్దరూ ఆంధ్రాలోనే కొనసాగుతారు.

**క్యాట్ ఆదేశాలతో**

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన సమయంలో.. సంబంధిత చట్టం ఆధారంగా ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులను డీఓపీటీ రెండు రాష్ట్రాలకు విభజించింది. ఈ కేటాయింపులు సరిగా జరగలేదంటూ తెలంగాణలో పనిచేస్తున్న పలువురు అధికారులు.. అప్పట్లోనే కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ (క్యాట్)ను ఆశ్రయించారు. ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు తెలంగాణలో కొనసాగుతున్నారు. ఇలా కొనసాగుతూ తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన సోమేశ్‌కుమార్‌పై డీఓపీటీ గతేడాది జనవరిలో హైకోర్టును ఆశ్రయించింది. క్యాట్ ఆదేశాలను హైకోర్టు కొట్టేయడంతో సోమేశ్‌కుమార్ తెలంగాణలో రిలీవ్ అయ్యి ఆంధ్రప్రదేశ్‌లో చేరి వెంటనే వీఆర్ఎస్ తీసుకొన్నారు. మిగిలిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల కేటాయింపును పునఃసమీక్షించాలని, అందుకు వారు అర్హులేనని ఈ ఏడాది జనవరి 3న హైకోర్టు ఆదేశించి, కేసును మూసివేసింది. నిర్ణయం తీసుకొనే ముందు వారి అభ్యర్థనను వినాలని కోర్టు డీఓపీటీకి సూచించింది. దీని ప్రకారం ఈ ఏడాది మార్చి 21న మాజీ కార్యదర్శి దీపక్ ఖండేకర్‌తో డీఓపీటీ ఏకసభ్య కమిటీని నియమించింది. వారి రికార్డులను పరిశీలించడంతో పాటు జూన్‌లో వ్యక్తిగతంగా విచారించిన కమిటీ.. ఆ అధికారుల అభ్యర్థనను తిరస్కరించింది. దీంతో ఆయా అధికారులు తెలంగాణలో రిలీవ్ అయ్యి ఈ నెల 16వ తేదీలోగా ఆంధ్రప్రదేశ్‌లో చేరాలని డీఓపీటీ ఆదేశించింది. ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు రావాల్సిన వారికి కూడా ఇదే రకంగా ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది.

# మేడ్చల్ త్రికోణ రాజకీయం

# కార్యకర్తలు అయోమయం.

కరుణాకర్ మల్లిగారి. కరపత్రం ప్రతినిధి మేడ్చల్.

మేడ్చల్ నియోజక వర్గ రాజకీయాలు అటు ప్రజలను,ఇటు ప్రధాన పార్టీల కార్యకర్తలను గందరగోళానికి గురి చేస్తున్నాయి.ఇంకో పక్క అధికారులు ఎవరి మాటకు ప్రాధాన్యం ఇవ్వాలో తెలియక ఇబ్బందికి లోనవుతున్నారు.
నిన్నటి వరకు అధికారంలో ఉన్న బి ఆర్ ఎస్ పార్టీ తరపున మేడ్చల్ ఎమ్మెల్యేగా శ్రీ చామకూరి మల్లారెడ్డి గారు మళ్ళీ గెలిచారు. ఈ మేడ్చల్ ప్రాంతంలో ఎప్పుడూ అధికార రాజకీయాలను చవి చూడని బిజెపి తరపున శ్రీ ఈటెల రాజేందర్ గారు ఎం పీ గా గెలిచారు.మేడ్చల్ లోఎమ్మెల్యే,ఎంపీ గా గెలవని కాంగ్రెస్ ఏకంగా తెలంగాణ రాష్ట్ర అధికార పగ్గాలు అందుకోవడం తో ఎవరు అధికార పక్షమో ఎవరు ప్రతిపక్షమో తెలియని స్థితి మేడ్చల్ లో నెలకొన్నది.ఎమ్మెల్యేగా మంత్రిగా ఒక వెలుగు వెలిగిన శ్రీ మల్లారెడ్డి గారు ప్రభుత్వ దాడితో మౌనంగా ఉన్నారు. ప్రభుత్వ అధికారుల వద్ద ప్రజల పనులు సిఫార్సు చేయించలేక బి ఆర్ ఎస్ క్యాడర్ మల్లారెడ్డి గారి లాగే మౌన ముద్ర దాల్చారు. శాంతి భద్రతలు చూసే పోలీసుల వద్ద,రెవెన్యూ లాంటి అన్ని ప్రభుత్వ ముఖ్య శాఖల అధికారుల వద్ద ప్రజల పనులకు సిఫార్సులు చెయ్యలేని బి ఆర్ ఎస్ నాయకులు ఏదో ఒక రకంగా పని కానిస్తున్నారు. బి ఆర్ ఎస్ పాలనలో చేసిన అభివృద్ధిని సంక్షేమ పథకాలను కొనసాగించలేని కాంగ్రెస్ ప్రభుత్వానిది అసమర్ధ పాలన అంటూ మేడ్చల్ మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు శ్రీ చీర్ల దయానంద్ యాదవ్ గారు,జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు శ్రీ బసరాజు భాస్కర్ యాదవ్ గారు విమర్శిస్తున్నారు.ఇదిలా ఉంటే తమ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు పర్యవేక్షణ చేసే స్థితి లేక బి ఆర్ ఎస్ శ్రేణులు ప్రజలకు సంక్షేమ పథకాలు అందించే అవకాశం లేక అధికారం లేక సతమత మవుతున్నారు.బి ఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో పేదలకు,వృద్దులకు,వితంతువులకు,విలాంగులకు ఫించన్లు ఇచ్చి కూడా ఇప్పుడు ఏమీ చెయ్యలేని,ఏమీ చెప్పలేని స్థితి క్రింది స్థాయి బి ఆర్ ఎస్ శ్రేణులది.


**ఇంకో పక్క అధికార కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు,నాయకులది ఇంకో రకం పరిస్థితి.**

రాష్ట్ర ప్రభుత్వం ఉన్నా క్షేత్ర స్థాయి అధికారం లేకపోవడం వల్ల కాంగ్రెస్ కార్యకర్తలు,నాయకుల పరిస్థితి ఎవరికి వారే










యమునా తీరే అన్నట్లుగా మారింది.గ్రామ స్థాయి కాంగ్రెస్ కార్యకర్తలు ఈ అధికార వైభవం చలాయించుకోవాలని ఒక పక్క పాకులాడుతుంటే, పై స్థాయి నాయకులు తమ మాట చెల్లుబాటు కొరకు ప్రభుత్వ అధికారుల వద్ద ఆధిపత్యం చెల్లుబాటు కావాలని తాపత్రయ పడుతున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ నేతల సిఫార్సులు అవుననక కాదనక అధికారులు మౌన భాధ అనుభవిస్తున్నారు.ముఖ్యంగా పోలీసు అధికారుల వద్ద తిమ్మిని బమ్మి చేసి తమ ప్రాభవాన్ని చాటుకోవాలని కాంగ్రెస్ స్థానిక కాంగ్రెస్ నాయకులు పాకులాడుతున్నారు.కాంగ్రెస్ క్రింది స్థాయి క్యాడర్ తమ రాజకీయ ఉనికిని చాటుకోవాలని పని చేస్తున్నారు.తమది ప్రజా ప్రభుత్వమని కాంగ్రెస్ నాయకులు చెప్పుకుంటుంటే ఇంకో పక్క మేడ్చల్ కాంగ్రెస్ లో కుమ్ములాటలు రచ్చకెక్కుతున్నాయి. గౌడవెల్లి మాజీ సర్పంచ్ శ్రీ గరిసెల సురేందర్ గారు కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను,ప్రభుత్వ పథకాలను ఏకరువు పెడుతుంటే,ఇంకోపక్క మేడ్చల్ కాంగ్రెస్ నాయకులు అసమ్మతి రాగాలు ఆలపిస్తున్నారు.ఏక పక్షంగా ప్రకటించిన మేడ్చల్ మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్ష కార్యవర్గ నియామకం చెల్లదని, దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీకి అంకితమై పనిచేసిన కార్యకర్తలకు నాయకులకు చెప్పకుండా ఏకాభిప్రాయం లేకుండా స్థానిక నాయకులను సంప్రదించకుండా మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ని ప్రకటించారని బహిరంగ విమర్శ చేసారు. నియోజక వర్గ ఇంచార్జ్ శ్రీ వజ్రేష్ యాదవ్ ఏ జంగయ్య యాదవ్ గారు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీ హరి వర్ధన్ రెడ్డి గారు కలిసి పార్టీ కార్యకర్తల అభిప్రాయం తీసుకోకుండా ప్రకటించిన వ్యవసాయ మార్కెట్ కమిటీని రద్దు చేసి అందరి ఆమోదం అభిప్రాయం తో కొత్త కమిటీ ఏర్పాటు చెయ్యాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీ గోమారం రమణారెడ్డి గారు ఉపాధ్యక్షుడు శ్రీ దుడ్డు సంజీవ రావు గారు మేడ్చల్ కార్యకర్తలు,నాయకులతో కలిసి తేదీ:10 అక్టోబర్ 24 రోజున మేడ్చల్ ప్రెస్ మీట్ లో బహిరంగ తిరుగుబాటు జెండా ఎత్తారు.ఈ పరిణామాలతో మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ పరిస్థితి బజారుకెక్కింది.ఇక బిజెపి పార్టీ కొత్తగా అధికార రుచి చూస్తున్నది.శ్రీ ఈటెల రాజేందర్ గారు ఎం పీ గా గెలిచిన మల్కాజిగిరి నియోజక వర్గ పరిధిలోని మేడ్చల్ బిజెపి కార్యకర్తలకు అధికారం అందని ద్రాక్ష పళ్ళు పుల్లన అన్నట్టుగా ఉన్నది.ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టి దిగ్విజయంగా అమలు చేస్తున్న పథకాలను సవివరంగా సీనియర్ బిజెపి నాయకుడు శ్రీ పట్లోళ్ళ విక్రమ్ రెడ్డి గారు వివరించారు. కేంద్ర స్పయిస్ బోర్డ్ మాజీ డైరెక్టర్ గా, మేడ్చల్ జిల్లా బిజెపి రూరల్ జిల్లా అధ్యక్షుడిగా పని చేసిన శ్రీ విక్రమ్ రెడ్డి గారు కేంద్ర బిజెపి ప్రభుత్వం గ్రామ పంచాయితీల నుండి మొదలుకొని తెలంగాణ రాష్ట్ర వికాసం కొరకు లక్షల కోట్ల రూపాయల నిధులు విడుదల చేసిందని చెప్పుకొచ్చారు.ప్రధాని మోడీ మచ్చలేని పాలనతో,చరిష్మాతో స్వంత పలుకుబడి ప్రతిభ కలిగిన శ్రీ ఈటెల రాజేందర్ గారు ఎం పీ గా గెలిచినప్పటికీ ఇంతకు ముందు ఎప్పుడూ అధికారం రుచి తెలియని బిజెపి క్యాడర్ అలవాటైన జిందాబాద్ నినాదాలకే పరిమిత మయ్యారు. శ్రీ విక్రమ్ రెడ్డి లాగా కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రచారం చేసి ప్రజలను చైతన్యం చేసే మెలుకువ ఇంకా క్రింది స్థాయి బిజెపి క్యాడర్ కు అబ్బ లేదు.ఈ రకంగా మూడు ప్రధాన పార్టీలు కాంగ్రెస్,బిజెపి,బి ఆర్ ఎస్ ల బలగాలు త్రికోణ రాజకీయంతో త్రిశంకు స్వర్గంలో విహరిస్తున్నారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏ పార్టీది ఏ స్థానమో తెలిసిపోతుంది.అన్ని పార్టీల కార్యకర్తలు సోషల్ మీడియా ప్రచారానికి మాత్రమే అంకితమయ్యారు. క్షేత్ర స్థాయిలో గ్రామ స్థాయిలో ప్రజలతో కలిసి ప్రజా సమస్యలపై పోరాటం చేసే కార్యకర్తలు కరువయ్యారు.సెల్ ఫోన్ లకు అంకితమై, పార్టీల ఆన్ లైన్ సభ్యత్వం తీసుకొని వాట్సప్ లో, ఫేస్ బుక్ ఖాతాలో పోస్ట్ చేసి మురిసిపోయే క్యాడర్ పెరిగిపోయింది.ఒక పార్టీ ఇంకొక పార్టీని,ఒక నాయకుడు ఇంకొక నాయకుణ్ణి తిట్టడం మాత్రమే రాజకీయంగా మారింది.ఈ టిక్కు టాకు రాజకీయాలు ముందు ముందు ఎలా పరిణమిస్తాయో చూడాల్సిందే.

## హైడ్రాతో కలిసి మూసీ ఆక్రమణల కూల్చివేతలు

## పర్యావరణ పరిరక్షణకా.. స్వప్రయోజనాల సాధనకా!

మొదటి పేజీ తరువాయి

హైద్రాబాద్ కీ హవా, బొంబై కీ దవా..

హైద్రాబాద్ కీ హవా, బొంబై కీ దవా అని హైద్రాబాద్ కు ఒక పేరుండేది. ఒకప్పుడు మందులన్నీ బొంబాయి లో తయారయ్యేవి. కానీ హైద్రాబాద్ గాలి బొంబై మందుల కంటే మంచిదని ఒక నానుడి వినిపించేది.భూములకు డిమాండ్ పెరిగి,భూ బకాసురులు పుట్టుకొచ్చి హైద్రాబాద్ పర్యావరణాన్ని నాశనం చేసారు. కుంటలు చెరువులు ఇతర నీటి వనరులు ఎన్నో ఆక్రమణకు గురయ్యి హైద్రాబాద్ కలుషిత కాసారంగా మారింది.ఈ పాపానికి కారణం పాలక ప్రభుత్వాలు అని ఖచ్చితంగా చెప్పవచ్చు.ముందు చూపు లేని ప్రభుత్వాలు నాయకుల ధన దాహం ఈ విధ్వంసానికి కారణం.అధికారులు తయారు చేసిన మాస్టర్ ప్లాన్ లను తుంగలో తొక్కి పాలనలో ఉన్న నాయకులు వారి అనుంగు అనుచరుల కొరకు ప్రకృతిని చెరబట్టారు.ఈ పాపం ఏ ఒక్క పార్టీకి ఆపాదించలేము. ఇది అందరి సమిష్టి పాపం.నిధులు లేక ఇచ్చిన హామీలు అమలు చెయ్యలేక రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజల దృష్టి మళ్లించడానికి ఈ హై'డ్రామా'ను సృష్టించిందని విమర్శలు వస్తున్నాయి.ఈ హైడ్రా అవతరణతో ఇతర సమస్యలన్నీ పక్క దారి పడతాయని ఆశించిన రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వ అంచనాలు తప్పాయి.దీన్ని కప్పి పుచ్చడానికి ప్రయత్నాలు మొదలయ్యాయి.నిర్వాసితుల పక్షాన మాట్లాడేవారి విమర్శలకు జవాబుగా రేవంత్ రెడ్డి గారు ప్రతి విమర్శ చేసారు.ఈ మూసీ నిర్వాసితులకు ఏ విధంగా న్యాయం చెయ్యాలో సలహా ఇవ్వమని, బాధితులకు న్యాయం చేయలేమా! మన ప్రభుత్వం వీరి పునరావాసానికి తగిన ఇండ్లు నిర్మించడానికి,కావాల్సిన నిధులు సమకూర్చే శక్తి ఉందని అన్నారు. నిర్వాసితులను ఈ మూసీ మురికి కూపం నుండి తరలించి ఈ.సి.ఐ.ఎల్. దగ్గరలోని జవహర్ నగర్ లో 1000 ఎకరాల్లో ఇండ్లు నిర్మించి ఇవ్వలేమా? ఎందుకు ప్రతిపక్షాలు గొడవ చేస్తున్నాయని రేవంత్ రెడ్డి మాట్లాడిన తీరు ఎవ్వరికీ నచ్చడం లేదు.మూసీ పేదలు చిన్న చిన్న పనులు చేసుకుని జీవించేవారు.తమ నివాసాలకు దగ్గరలో ఇంటి పనులకు,వాచ్ మెన్, హోటల్లు, కూలీ నాలీ చేసుకుంటూ తమ పిల్లల్ని పక్కన స్కూళ్ళలో చదివిస్తూ బతుకు వెళ్లదీస్తున్న పేదలను హఠాత్తుగా నిరాశ్రయులను చెయ్యడం సరికాదని,ఎక్కడో దూరంగా పునరావాసం కల్పిస్తే జీవనోపాధి ఎలాగ అని కోర్టులతో సహా అందరి నుండి వినిపిస్తున్న మాట.ఎక్కడో కాకుండా దగ్గరలో గల మూసీ చాదర్ ఘాట్ దగ్గరలో నిరుపయోగ స్థితికి చేరుకున్న రేస్ కోర్స్, చంచల్ గూడా జైలు లాంటి విశాల స్థలాల్లో పేదలకు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ వినిపిస్తున్నది.
ఆ ఇండ్లు నిర్మించకుండా పేదలను రోడ్డు పైకి లాగడం అమానవీయమని అందరి అభిప్రాయంగా ఉన్నది.ఇండ్లు కోల్పోతున్న వారు లిస్ట్ తయారు చేసి,వారికి సమాచారం అందించి,ఇండ్లు ఖాళీ చెయ్యడానికి తగిన సమయం ఇచ్చి కూల్చివేతలు చేపట్టాలని భాదితులు,బాధిత పక్ష ప్రజలు గొంతు విప్పి చెబుతున్నారు.గత బి.ఆర్.ఎస్. ప్రభుత్వం ఖజానా ఖాళీ చేసి పెట్టిందని చెప్పిన సి.ఎం. రేవంత్ రెడ్డి గారు ఇండ్లు కట్టించడానికి డబ్బులు ఎలా సమకూరుస్తారని శ్రీ ప్రకాష్ గారు ఒక సుదీర్ఘ ఇంటర్వ్యూ లో మాట్లాడారు.శ్రీ రేవంత్ రెడ్డి గారి ఈ కూల్చివేతలు కేవలం రియల్ ఎస్టేట్ డెవలపర్లను భయపెట్టి నిధులు సమీకరించే కార్యక్రమమని శ్రీ ప్రకాష్ గారు అన్నారు.హఠాత్తుగా ప్రకటితమైన హైడ్రా అంతే హఠాత్తుగా విమర్శలకు గురి కావడం కాంగ్రెస్ శ్రేణులకు మింగుడు పడడం లేదు. అందుకే హైడ్రా ను ఏ కాంగ్రెస్ నాయకుడు కూడా బహిరంగంగా సమర్ధించడం లేదు.చివరికి ఈ హైడ్రా రేవంత్ రెడ్డి గారి కుర్చీకి ఎసరు పెట్టినా ఆశ్చర్యం లేదని శ్రీ ప్రకాష్ గారు తన సుదీర్ఘ ఇంటర్వ్యూలో స్పష్టం చేసారు.
ఈ మూసీ మురికిలో కాంగ్రెస్ పార్టీ మునిగిపోకుండా చూసుకునే బాధ్యత ఆ నాయకత్వానిదే అవుతుంది.

## దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపిన మెట్ పల్లి సీఐ నిరంజన్ రెడ్డి.

**కరపత్రం ప్రతినిధి,మెట్ పల్లి, అక్టోబర్ 11.**
జగిత్యాల జిల్లా మెట్పల్లి సర్కిల్ పరిధిలోని అన్ని గ్రామాలకు ప్రజలకు, ప్రజాప్రతినిధులకు ,యువతకు, విద్యార్థులకు దసరా పండుగ సందర్భంగా శుక్రవారం పత్రిక ప్రకటనలో మెట్ పల్లి సీఐ నిరంజన్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ దుష్టశక్తులపై విజయానికి సంకేతం గా జరుపుకునే పండుగ దసరా పండుగని తెలియజేశారు. మెట్పల్లి సర్కిల్ పరిధిలోని మెట్పల్లి పట్టణంతోపాటు గ్రామీణ ప్రాంతాలు, మల్లాపూర్ మండలం ఇబ్రహీంపట్నం మండలం లోని ప్రజలు విజయదశమి పండుగ స్ఫూర్తిని తీసుకొని ప్రజలందరి ఐక్యమత్యంతో ఉండాలని కోరారు. మీ కుటుంబాలతో సుఖ సంతోషాలతో ఉండాలని అన్నారు. మద్యం సేవించి అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా తెలిపారు




## వనపర్తి ఆర్టీసీ డిపోలో ప్రత్యేక పూజలు

– పాల్గొన్న డిపో మేనేజర్ వేణుగోపాల్

**కరపత్రం వనపర్తి ప్రతినిధి:**
వనపర్తి ఆర్టీసీ డిపో గ్యారేజీలో శుక్రవారం డిపో మేనేజర్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో సిబ్బంది గ్యారేజ్ లోని పనిముట్లకు, బస్సులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.దసరా నవరాత్రులలో భాగంగా ప్రతిరోజు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని డిఎం తెలిపారు.పూజా కార్యక్రమాల అనంతరం సిబ్బందికి అన్నదానం చేశారు.ఈ కార్యక్రమంలో మెకానికల్ సూపర్వైజర్ దేవేందర్ శ్రీనివాసులు ట్రాఫిక్ సూపర్వైజర్ బాలిరెడ్డి కృష్ణయ్య, చిన్ని రమేష్ ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.



## తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో వస్తోన్న ఫీల్ గుడ్ మూవీ

తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో సరికొత్త ఫీల్ గుడ్ ఎంటర్టైనర్ రానుంది. ఈ సినిమాకు డైరెక్టర్ కృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. మాతంగి మీడియా వర్క్స్ బ్యానర్, దీప విజయ లక్ష్మి నాయుడు క్రియేషన్స్ బ్యానర్లపై ఆకుల విజయ లక్ష్మి, సరస్వతి మౌనిక ప్రొడక్షన్ నంబర్ -1 గా నిర్మిస్తున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విజయదశమి పర్వదిన సందర్భంగా మా సినిమాను స్టార్ట్ చేయడం చాలా ఆనందంగా ఉంది. సినిమా అభిమానులతో పాటు, ఆ ఆధిపరాశక్తి దుర్గామాత అమ్మవారి ఆశీస్సులు కూడా మా చిత్ర యూనిట్‌కి దక్కుతాయని భావిస్తున్నాం అని తెలిపారు.కాగా.. ఈ సినిమాను తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిస్తున్నట్లు తెలిపారు. ఈ సినిమాలో నటీనటులు వివరాలు త్వరలో తెలియజేస్తామని మేకర్స్ వెల్లడించారు. ఈ సినిమాకు వెంకట్ గౌడ్ కథ అందించగా.. కర్రా నరేంద్ర రెడ్డి డైలాగ్స్ సమకూరుస్తున్నారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శనివారం అక్టోబర్ 12 2024



## థాంక్యూ అలియా..
# రష్మిక పోస్ట్ వైరల్

బాలీవుడ్ నటి అలియాభట్ పై నటి రష్మిక ప్రశంసల వర్షం కురిపించారు. యాక్టింగ్‌లో అలియా టాలెంట్, కథల ఎంపికను ఆమె మెచ్చుకున్నారు. విభిన్నమైన కథలను తరచూ ప్రేక్షకులకు అందిస్తున్నందుకు ధన్యవాదాలు చెప్పారు. ఈ మేరకు తాజాగా ఇన్‌స్టా స్టోరీస్ వేదికగా పోస్ట్ పెట్టారు."అలియా భట్, వేదాంగ్ నటించిన 'జిగ్రా' చూశా. సినిమా అద్భుతంగా ఉంది. నటీనటులు, చిత్రబృందాన్ని గట్టిగా హత్తుకుని మెచ్చుకోకుండా ఉండలేకపోయా. అలియా.. నువ్వు మాకు దొరకడం ఓ వరం. నీ టాలెంట్‌ని చూసే అవకాశం మాకు ఇచ్చినందుకు థాంక్యూ. వేదాంగ్ నువ్వు మరెన్నో చిత్రాలు నటిస్తే చూడాలనుకుంటున్నా. రాహుల్.. నువ్వు నన్నెంతో సర్‌ప్రైజ్ చేశావు. నీకు, 'జిగ్రా'లో నువ్వు పోషించిన మత్తు పాత్రకు చాలా వ్యత్యాసం ఉంది. వాసన్ బాలా.. మేకింగ్ చాలా బాగుంది. ఇంకెన్నో విషయాలు చెప్పాలని ఉంది. చిత్రబృందం మొత్తానికి నా అభినందనలు" అని రష్మిక రాసుకొచ్చారు.బాలీవుడ్ నటీనటులు అలియాభట్ , వేదాంగ్ రైనా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'జిగ్రా'. యాక్షన్ డ్రామాగా రూపుదిద్దుకున్న ఈ చిత్రానికి వాసన్ బాలా దర్శకత్వం వహించారు. కరణ్ జోహార్ నిర్మాత. తమ్ముడు కోసం అక్క చేసే పోరాటం నేపథ్యంలో ఇది సిద్ధమైంది. శుక్రవారం ఈ సినిమా ప్రేక్షకుల ముందుకువచ్చింది. సినీ తారల కోసం ముంబయిలో 'జిగ్రా' స్పెషల్ షో వేశారు. దీనికి రష్మిక హాజరైన విషయం తెలిసిందే. ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై రానా తెలుగులో ఈ చిత్రాన్ని విడుదల చేశారు. సినిమా విడుదల సందర్భంగా మహేశ్‌బాబు చిత్రబృందానికి ఆల్ ది బెస్ట్ చెప్పారు.

# 'దేవర 2'లో మరికొందరు బాలీవుడ్ స్టార్స్.. ఎవరంటే!

ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'దేవర'. ఇటీవల విడుదలైన ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. దీంతో దీని సీక్వెల్‌కు సంబంధించిన అప్‌డేట్స్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ సినిమా ప్రచారంలో భాగంగా దర్శకుడు ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'దేవర2' గురించి ఆసక్తికర కామెంట్స్ చేశారు. ఈ సీక్వెల్‌లో మరికొందరు బాలీవుడ్ స్టార్స్ ఉండే అవకాశం ఉందన్నారు."ఇది జరుగుతుందో, లేదో నాకు తెలియదు కానీ.. 'దేవర2'లో రణ్‌వీర్ సింగ్, రణ్‌బీర్ కపూర్ ఉంటే బాగుంటుంది. ఇది నా వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే. ఇది జరుగుతుందో, లేదో తెలియకుండా నేను ఎక్కువ వివరాలు పంచుకోకూడదు. తెలుగు, తమిళ ఇండస్ట్రీలకు చెందిన నటీనటుల పేర్లు చెబితే ఇప్పటినుంచే ఊహాగానాలు మొదలవుతాయి. 'దేవర2'లో అతిథి పాత్రలు కూడా ఉంటాయి. అవి సినిమాలో చాలా కీలకమైనవి. అతి త్వరలోనే వాటి వివరాలు ప్రకటిస్తాను" అని కొరటాల శివ అన్నారు.'దేవర 2'పై కొరటాల ఎప్పటికప్పుడు అంచనాలు పెంచేస్తున్నారు. మొదటిభాగం కంటే రెండోభాగం చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుందని




ఇటీవల వెల్లడించారు. పార్ట్ 1లో చూసింది 10 శాతమేనని.. రెండో భాగంలో 100శాతం చూస్తారన్నారు. ప్రతీ పాత్రలో ట్విస్ట్ ఉంటుందని చెప్పారు . ఎన్టీఆర్ కూడా ఈ సీక్వెల్ గురించి మాట్లాడుతూ.. మొదటి భాగం విజయం సాధించడంతో తమ బాధ్యత మరింత పెరిగిందన్నారు. 'దేవర' కంటే దాని సీక్వెల్ ఇంకా బాగుంటుందన్నారు.

# ఆగస్టులో తెరపైకి 'కాంతార 1'

రిషబ్ శెట్టి ప్రధాన పాత్రలో నటిస్తూ స్వయంగా తెరకెక్కిస్తున్న చిత్రం 'కాంతార: చాప్టర్ 1'. 'కాంతార'కు ప్రీక్వెల్‌గా నిర్మితమవుతున్న ఈ పాన్ ఇండియా సినిమాని హొంబలే ఫిల్మ్స్ సంస్థ నిర్మిస్తోంది. చిత్రీకరణ దశలో ఉన్న ఈ చిత్ర నిర్మాత విజయ్ కిరగందూర్ ఓ వేడుకలో పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఈ ప్రీక్వెల్ చాలా బాగా వస్తోందని.. ఇప్పటికే 30శాతం చిత్రీకరణ పూర్తయిందని..

ప్రస్తుతం కుందాపురలో సిద్ధం చేసిన సెట్స్‌లో చిత్రీకరణ చేస్తున్నామని వివరించారు. ఈ సినిమాని వచ్చే ఏడాది ఆగస్టులో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చే అవకాశమున్నట్లు తెలియజేశారు. ఇది కదంబ యుగం నేపథ్యంలో సాగే ఆసక్తికర కథాంశంతో రూపొందుతోంది ఇందులో రిషబ్ మునుపెన్నడూ చూడని విధంగా విభిన్నమైన లుక్‌లో కనువిందు చేయనున్నారు. ఆయన తండ్రి పాత్రలో మలయాళ స్టార్ మోహన్‌లాల్ కనిపించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ చిత్రానికి అజనీష్ లోక్‌నాథ్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.



# డిసెంబరు నుంచి బరిలోకి!

కథానాయకుడు సూర్య ఇప్పటికే రెండు చిత్రాలు పూర్తి చేశారు. ఆయన నటించిన 'కంగువా' నవంబరులో తెరపైకి రానుండగా.. కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో చేసిన 'సూర్య 44' (వర్కింగ్ టైటిల్) నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈలోగానే మరో ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించేందుకు సిద్ధమవుతున్నారు సూర్య. ఆయన ప్రస్తుతం నటుడు, దర్శకుడు ఆర్.జె.బాలాజీ దర్శకత్వంలో ఓ చిత్రం చేయనున్న సంగతి తెలిసిందే. 'సూర్య 45'గా సెట్స్‌పైకి వెళ్లనున్న ఈ సినిమాని డ్రీమ్ వారియర్ పిక్చర్స్ సంస్థ నిర్మించనుంది. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనుల్లో ఉన్న ఈ చిత్రం డిసెంబరు నుంచి చిత్రీకరణ ప్రారంభించుకోనుందని సమాచారం. ఇందుకోసం చిత్ర బృందం లొకేషన్ల వేట మొదలెట్టినట్లు తెలుస్తోంది. ఏఆర్ రెహమాన్ సంగీత దర్శకుడిగా వ్యవహరించనున్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ ప్రాజెక్ట్ పూర్తయిన వెంటనే సూర్య, వెట్రిమారన్ దర్శకత్వంలో 'వాడివాసల్'ను పట్టాలెక్కించనున్నారు.




# బహుశా అవార్డు అందుకుంటూ ఏడ్చిన తొలి నటినేమో!

ఇటీవల దిల్లీలో జరిగిన జాతీయ పురస్కారాల వేడుకలో వేదికపై ఉత్తమ నటి పురస్కార విజేత మానసీ పరేఖ్ కన్నీళ్లు పెట్టుకోవడం తెలిసిందే. మరి అంతటి ఆనందకర సమయంలో భావోద్వేగానికి కారణం ఏంటో తాజాగా ఓ ఇంటర్వ్యూలో చెప్పింది మానసి. "రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు తీసుకున్నందుకు నాకు గర్వంగా ఉంది. అవార్డు తీసుకోవడానికి వేదిక పైకి పిలిచినప్పుడు ఇది నిజమేనా.. అనుకున్నాను. ఒక్కో మెట్టూ ఎక్కుతుంటే అప్పటి వరకూ నా జీవితంలో ఎదుర్కొన్న సమస్యలు, నన్ను ఎప్పుడూ ప్రోత్సహించే నా తల్లిదండ్రులు, నా భర్త, స్నేహితులు, అభిమానులు.. ఇలా అందరూ గుర్తొచ్చారు. ఇంతమంది గొప్పవ్యక్తుల మధ్య అవార్డు అందుకుంటున్న భావన, మాటలకు అందని సంతోషంలో కన్నీళ్లు ఆగలేదు. మాటల్లో చెప్పలేనంత ఆనందం వస్తే శరీరం మనకు తెలియకుండానే స్పందిస్తుందేమో. బహుశా వేదికపై అవార్డు తీసుకుంటూ ఏడ్చిన మొదటి నటిని నేనేనేమో (నవ్వుతూ)" అని అంది మానసి.



## రెండు చేతులతో ఆటోగ్రాఫ్..
# అమితాబ్ గురించి మీకివి తెలుసా?



ఏదైనా సమస్య ఎదురైతే.. 'నాకెందుకు ఇలా జరిగింద'ని కొందరు బాధ పడతారు. మరికొందరు 'దాన్ని ఎలా అధిగమించాలా?' అని ఆలోచిస్తారు. అమితాబ్ బచ్చన్ ఈ రెండో జాబితాలో నిలుస్తారు. ఆ పాజిటివ్ ఆలోచనలే ఆయన్ను అగ్రస్థాయికి తీసుకెళ్లాయి. నేడు అమితాబ్ పుట్టినరోజు సందర్భంగా.. ఆయన గురించి కొన్ని ఆసక్తికర విశేషాలివీ..

తన ఆలోచనలు, జ్ఞాపకాలను ఎక్కువగా బ్లాగ్ ద్వారా పంచుకుంటుంటారు అమితాబ్.

బచ్చన్ అనేది తమ ఇంటి పేరు కాదని, తన తండ్రి హరివంశరాయ్ కలం పేరని ఓ సందర్భంలో తెలిపారు. అమితాబ్ సవ్యసాచి. ఒకేసారి రెండు చేతులతో ఆయన రాయగలరు. పలు సందర్భాల్లో.. అభిమానులకు అలా ఆటోగ్రాఫ్ ఇచ్చి ఆశ్చర్యపరిచారు.

చదువు పూర్తయ్యాక కొన్నాళ్లపాటు కోల్‌కతాలోని ఓ షిప్పింగ్ సంస్థలో పని చేశారు. నటనపై ఆసక్తితో ఆ ఉద్యోగానికి రాజీనామా చేసి ముంబయి వెళ్లారు. తన కల నెరవేర్చుకొని ఎందరికో స్ఫూర్తిగా నిలిచారు.

'సాత్ హిందూస్థానీ'తో 1969లో తెరంగేట్రం చేశారు. హిందీ, తెలుగు, మలయాళం, భోజ్‌పురి తదితర భాషల్లో 200కి పైగా చిత్రాల్లో విభిన్న పాత్రలు పోషించి అలరించారు.

తొలి సినిమాతో 'న్యూ కమర్' విభాగంలో నేషనల్ ఫిల్మ్ అవార్డు అందుకున్న ఆయన.. ఆ తర్వాత వరసగా 12 సినిమాలతో పరాజయం ఎదుర్కొన్నారు. 'జంజీర్'తో తిరుగులేని నటుడిగానే కాకుండా 'యాంగ్రీ యంగ్ మ్యాన్'గా క్రేజ్ సంపాదించుకున్నారు. 'షోలే'తో ఆ క్రేజ్ రెట్టింపైంది. 20కిపైగా చిత్రాల్లో ఆయన విజయ్ అనే పాత్ర పోషించడం విశేషం. 'జంజీర్', 'దీవార్', 'శక్తి' తదితర సినిమాలు కొన్ని ఉదాహరణలు.

బాలీవుడ్‌లో అత్యధిక చిత్రాల్లో ద్విపాత్రాభినయం చేసిన నటుడాయనే. 'డాన్', 'ది గ్రేట్ గ్యాంబ్లర్', 'సూర్యవంశం' వంటి సినిమాల్లో రెండు పాత్రలతో అభిమానులకు వినోదం పంచారు.ఈ నటుడిలో మంచి గాయకుడు ఉన్నాడు. 30కి పైగా పాటలు ఆలపించారు. 'లావారిస్'లోని మేరే అంగానే మే, 'సిల్‌సిలా'లోని నీలా ఆస్మన్ సో గయా వంటి సాంగ్స్ ఈయన పాడినవే.

లండన్‌లోని మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియంలో అమితాబ్ మైనపు విగ్రహం 2000లో కొలువుదీరింది. ఆ గౌరవం దక్కించుకున్న తొలి ఆసియా నటుడు ఈయనే కావడం విశేషం.

ఉత్తమ నటుడిగా నాలుగుసార్లు జాతీయ పురస్కారం (అగ్నిపథ్, బ్లాక్, పా, పీకూ), నిర్మాతగా ఓ జాతీయ అవార్డు (పా) పొందారు. 16కిపైగా ఫిల్మ్‌ఫేర్ అవార్డులతోపాటు ఐఫా, బాలీవుడ్ మూవీ అవార్డులు, బిగ్ స్టార్ ఎంటర్‌టైన్‌మెంట్ అవార్డులెన్నో అందుకున్నారు.

పద్మశ్రీ (1984), పద్మ భూషణ్ (2001), పద్మ విభూషణ్ (2015), దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు (2019)తోపాటు పలు విశ్వవిద్యాలయాల నుంచి డాక్టరేట్లు అందుకున్నారు. 82 ఏళ్ల అమితాబ్ ఇప్పటికీ అదే ఉత్సాహంతో నటిస్తూ.. యువ నటులకు పోటీనిస్తున్నారు. 'కల్కి 2898 ఏడీ'లోని అశ్వత్థామ పాత్రే అందుకు చక్కని ఉదాహరణ. రజనీకాంత్‌తో కలిసి ఆయన నటించిన 'వేట్టయన్' గురువారం విడుదలైంది. మరోవైపు, టెలివిజన్ షో 'కౌన్ బనేగా కరోడ్‌పతి'తో బుల్లితెర ప్రేక్షకులనూ అలరిస్తున్నారు.